సాక్షి సిద్దిపేట

గురువారం । 15 । జూన్ । 2023



ముందస్తు వరిసాగే మేలు

యాసంగిలో వరిసాగుచేసే రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వరిసాగుకు సంబంధించి పంటకాలాన్ని ముందుకు జరపాలని ప్రభుత్వం భావిస్తోంది. 4లో



సామూహిక అక్షరాభ్యాసం

చిన్నకోడూరు మండల పరిధిలోని రామంచ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. 5లో..

నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని సీపీ శ్వేత తెలిపారు. గురువారం నుంచి జూన్ 22వ తేదీ వరకు నిబంధనలు అమలులో ఉంటాయని, ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, సమావేశాలు, సభలు నిర్వహించరాదని సూచించారు. సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు కొనసాగుతాయని సీపీ పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

నేడు మర్కూక్‌కు 20 దేశాల ప్రతినిధులు

మర్కూక్(గజ్వేల్): వరల్డ్ ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజర్ సంస్థకు సంబంధించి 20 దేశాలకు చెందిన ప్రతినిధులతో పాటు మంత్రి నిరంజన్‌రెడ్డి గురువారం మర్కూక్ రానున్నట్లు మండల వ్యవసాయ అధికారి నాగేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు మర్కూక్‌లోని కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టును పరిశీలించనున్నారు. మర్కూక్‌లోని కొండపోచమ్మ ప్రాజెక్టును సందర్శన అనంతరం రైతు వేదికలోని రైతులతో కలిసి మాటముచ్చట నిర్వహిస్తారు.

వంట కార్మికులుగా మారిన ఉపాధ్యాయులు



వంట చేస్తున్న ఉపాధ్యాయులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు వంట కార్మికులుగా మారారు. వివరాలు ఇలా ఉన్నాయి..జగదేవ్‌పూర్ మండలంలోని మునిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన వంట కార్మికులు తమకు నెలసరి వంట బిల్లులు సక్రమంగా రావడం లేదని, మూడు, నాలుగు నెలలకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, అప్పులు చేసి వంటలు చేయాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వంట కార్మికులు పాఠశాలలు ప్రారంభం అయినప్పటి నుంచి రాకపోవడంతో బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రహీం, ఉపాధ్యాయులు కలిసి వంటచేసి విద్యార్థులకు వడ్డించారు.

68 సార్లు రక్తదానం



అవార్డు తీసుకుంటున్న ములుగు ఉపాధ్యాయుడు అమర్‌నాథరావు

ములుగు(గజ్వేల్): రక్తదాతగా పేరొందిన ములుగు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎర్రవల్లి అమర్‌నాథ రావుకు రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా బుధవారం హైదరాబాద్ రాజ్ భవన్ సంస్కృతీ హాల్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్త దాతల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 68 సార్లు రక్త దానం చేసిన ఎరవెల్లి అమర్‌నాథ రావుకు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ అవార్డ్ ప్రదానం చేశారు.

సర్టిఫికెట్ వెరిఫికేషన్



వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న సీపీ శ్వేత

సిద్దిపేట కమాన్: తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్ బోర్డ్ నిర్వహించిన పోలీస్ ఉద్యోగాల ఫైనల్ రాత పరీక్షలో అర్హత సాధించిన 414మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు బుధవారం అధికారులు పరిశీలించారు. స్థానిక పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆడిషనల్ డీసీపీ మహేందర్ ఆధ్వర్యంలో పరిశీలన కొనసాగింది. మహిళ అభ్యర్థులకు మొదట సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసినట్టు పోలీస్ కమిషనర్ శ్వేత తెలిపారు. అంతకుముందు సీపీ శ్వేత పరిశీలన ప్రక్రియ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠ

దుబ్బాకరూరల్: మండలంలోని ఎనగుర్తి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రఘునందన్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఆరోగ్య సిద్దిపేటలో మరో అడుగు

రూ.6కోట్లతో స్లాటర్ హౌస్

- నాణ్యమైన మాంసం అందించేలా ప్రణాళికలు
- నేడు ప్రారంభించనున్న మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్



ఇరుకోడ్ శివారులో నిర్మించిన స్లాటర్ హౌస్

సిద్దిపేటజోన్: ఆరోగ్య సిద్దిపేటలో భాగంగా పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన, నాణ్యమైన మాంసం అందించే ఆలోచనకు అడుగు పడింది. రూ.6 కోట్ల నిధులతో అత్యాధునిక వసతులతో నిర్మించిన స్లాటర్ హౌస్(కబేళా) ప్రజలకు అందుబాటులోకి రానుంది. గురువారం రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు, రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ల చేతుల మీద స్లాటర్ హౌస్ ప్రారంభం కానుంది.

- జిల్లాలో ఏకైక స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ సిద్దిపేటలో సుమారు 250మంది మాంసం విక్రయదారులు ఉన్నారు.
- మున్సిపాలిటీ ఆవిర్భావం నుంచి సుమారు రెండు దశాబ్దాల పాటు నాసర్ పురాలో, కొన్ని సంవత్సరాలుగా చింతల్ చెరువు వద్ద నామమాత్రంగా కబేళా(స్లాటర్ హౌస్) నిర్వహించారు.
- పట్టణంలో ఉన్న మాంసం విక్రేతలకు అనుగుణంగా ప్రస్తుతం ఉన్న స్లాటర్ హౌస్ సరిపోకపోవడంతో నివాస గృహాల వద్ద మేకలను, గొర్రెలను వధించే వారు.
- నిబంధనలకు విరుద్ధంగా జీవాలను వధించడంతో నాణ్యమైన మాంసం అనేది ప్రశ్నర్థకంగా మారింది.
- మరోవైపు స్వచ్ఛమైన మాంసం విక్రయాలు జరగాలని అందుకు సాంకేతిక, అత్యాధునిక వసతులతో స్లాటర్ హౌస్ నిర్మాణం చేయాలని బల్దియా సంకల్పించింది.
- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు ప్రత్యేక చొరవతో రూ.6 కోట్లతో ఇరుకోడ్ శివార్లలో రెండు ఎకరాల విస్తీర్ణంలో మోడల్ స్లాటర్ హౌస్ నిర్మాణం చేశారు.
- మోడల్ స్లాటర్ హౌస్‌లో మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. భారీ నీటి ట్యాంక్, మాంసం వ్యర్థాలతో గ్యాస్ తయారీ ప్లాంట్, వాటర్ ప్రూఫ్ ఫ్లోర్, ఫ్రిజర్ లాంటివి ఏర్పాటు చేశారు.
- స్లాటర్ హౌస్‌కు వచ్చే జీవాలను పరిశీలించి, పరీక్ష చేసేందుకు ప్రత్యేకంగా వెటర్నరీ డాక్టర్, మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్లతో పాటు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు.

నాణ్యమైన మాంసం అందుతుంది

ఇప్పటివరకు నామ మాత్రంగా స్లాటర్ హౌస్ ఉండడం వల్ల శుభ్రమైన మాంసంపై కొంత సందేహం ఉండేది. మోడల్ స్లాటర్ హౌస్ ఏర్పాటుతో ప్రతి జీవి అక్కడే పశు వైద్యుల సమక్షంలో వధించే అవకాశం ఉంటుంది. దీంతో నాణ్యమైన మాంసం ప్రజలకు అందుతుంది.

– చంద్రనారాయణ, సిద్దిపేట

- స్లాటర్ హౌస్ నిర్వహణ బాధ్యతలు ప్రయివేటు ఏజెన్సీకి అప్పగించేలా బల్దియా ప్రణాళికలు సిద్ధం చేసింది.
- సిద్దిపేటలో నిర్మించిన మోడల్ స్లాటర్ హౌస్ రాష్ట్రానికి మోడల్‌గా ఉండేలా మున్సిపల్ అధికారులు అవసరమైన వసతులు కల్పించారు.

స్థానికంగానే ఉపాధి అవకాశం



మంత్రుల పర్యటన వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటఅర్బన్: యువతకు స్థానికంగానే ఉపాధి కల్పించే లక్ష్యంతో నిర్మించిన ఐటీ టవర్ ప్రారంభోత్సవంతో పాటు సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్, ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు గురువారం సిద్దిపేటలో పర్యటించనున్నట్టు జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. బుధవారం ఐటీ టవర్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ శ్వేతతో కలిసి కలెక్టర్ మాట్లాడారు. గురువారం ఉదయం 10 గంటలకు మంత్రి కేటీఆర్ సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారని తెలిపారు. ఇర్కోడులో రూ. 6 కోట్లతో నిర్మించిన మోడల్ స్లాటర్ హౌజ్‌ను, రూ. 3 కోట్లతో ఆధునీకరించనున్న కప్పలకుంట చెరువు పనులకు, గద్దబొమ్మ సర్కిల్ వద్ద రూ.87 కోట్లతో తాగునీటి వసతి కొనసాగింపు పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా యువత పాల్గొనాలి..

యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశ్యంతో నిర్మించిన ఐటీ టవర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి యువత పార్టీలకతీతంగా పాల్గొనాలని సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు యువతకు పిలుపునిచ్చారు.

నేడు సిద్దిపేటలో..

సాక్షి, సిద్దిపేట: సిద్దిపేట పట్టణంలో రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు, రాష్ట్ర ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావులు పర్యటించనున్నారు. గురువారం పలు ప్రారంభోత్సవాలు, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు.

పక్కాగా విధులు నిర్వహించాలి

సిద్దిపేటజోన్: సిద్దిపేట జిల్లా కేంద్రంలో గురువారం రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని, ట్రాఫిక్ సమస్య లేకుండా పనిచేయాలని సీపీ శ్వేత సూచించారు. బుధవారం స్థానిక విపంచి ఆడిటోరియంలో బందోబస్తు కోసం వచ్చిన పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కాంగ్రెస్ నేతల అరెస్ట్ బాధాకరం

పీసీసీ సభ్యులు దరిపల్లి చంద్రం, హరికృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం బాధాకరమని పీసీసీ సభ్యులు దరిపల్లి చంద్రం, హరికృష్ణలు అన్నారు. రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటామని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ నాయకులు ముందస్తు ప్రకటనలతో పలువురు నాయకులను పోలీస్‌లు బుధవారం అరెస్ట్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువతకు ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగాలు కల్పించాలని లేకపోతే ఐటీశాఖ మంత్రి పర్యటనను అడ్డుకుంటామన్నారు. ఉదయం నుంచి పోలీసులు కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మజార్ మాలిక్, యూత్ స్టేట్ సెక్రటరీ పూజల గోపి, పట్టణ యువజన అధ్యక్షుడు గయాజుద్దీన్, అరవింద్, బబ్బు, తదితరులు నాయకులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు



రామునిపట్లలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

‘ఆరోగ్య సిద్దిపేటనే లక్ష్యం’

సిద్దిపేటకమాన్/సిద్దిపేటజోన్ : ఆరోగ్య సిద్దిపేటనే మంత్రి హరీశ్‌రావు లక్ష్యం అని జెడ్పీ చైర్‌పర్సన్ రోజశర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, సీపీ శ్వేత, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యుడు సాయిరాం, డీఎంహెచ్‌ఓ కాశీనాథ్, మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలాథామస్, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, డాక్టర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్య దినోత్సవాన్ని, ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదాతలను వైద్యాధికారులు ఘనంగా సన్మానించారు. అదేవిధంగా గర్భిణీలకు న్యూట్రిషియన్ కిట్లను, రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య సిద్దిపేటనే మంత్రి హరీశ్‌రావు లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. రక్తదానంతో ఇతరుల ప్రాణాలు కాపాడొచ్చు అని, ఒకరి రక్తదానంతో ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ ఆఫీసర్ డాక్టర్ అరుణచందర్, ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, డాక్టర్ సదానందం, కౌన్సిలర్ సాయి, ఇరిగేషన్ ఏఈ ఖాజా, వాసవి క్లబ్ ప్రతినిధులు ప్రసాద్, శ్రీనివాస్, ఆర్ఐ రాజశేఖర్‌రెడ్డి, కానిస్టేబుల్ శేఖర్, వేణు, రజనికాంత్‌రెడ్డి, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది కనకచంద్రం, ఆంజనేయులు, ఇమ్రాన్, ప్రణీత్, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.



రక్తదాతలను సన్మానిస్తున్న రోజాశర్మ, మంజుల, సీపీ శ్వేత, తదితరులు

మహిళల్లో చైతన్యం రావాలి..

చిన్నకోడూరు(సిద్దిపేట): మహిళల ఆరోగ్య పరిరక్షణకు చేపట్టిన రుతుప్రేమ కార్యక్రమంపై మహిళల్లో చైతన్యం రావాలని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. బుధవారం రామునిపట్లలో మహిళలకు రుతుప్రేమపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం మహిళలకు క్లాత్ ప్యాడ్స్, కప్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుంటుందన్నారు. మహిళలు శానిటరీ ప్యాడ్స్‌కు బదులుగా పర్యావరణ హితమైన క్లాత్ ప్యాడ్స్‌ను వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ దేవకీ దేవి, డాక్టర్ శాంతి, సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ సోమిరెడ్డి, పాల్గొన్నారు.

వైద్య రంగంలో తెలంగాణే దిక్సూచి

ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: వైద్య రంగంలో తెలంగాణ అద్భుత ఫలితాలను సాధించి దేశానికి దిక్సూచిగా నిలుస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గజ్వేల్‌లోని మహతి ఆడిటోరియంలో నిర్వహించిన వైద్యారోగ్య దినోత్సవానికి వారు ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించడంతో పాటు గర్భిణీలకు న్యూట్రీషన్ కిట్, చిన్న పిల్లలకు కేసీఆర్ కిట్ వంటి కార్యక్రమాలు ప్రశంసలను చూరగొంటున్నాయని చెప్పారు. బస్తీ దవఖానాల ఏర్పాటుతోనూ పేదలకు వైద్య సేవలు మరింత చేరువకానుందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపీపీ అమరాతి, జెడ్పీటీసీ మల్లేశం, రైతు బంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దేవీ రవీందర్ పాల్గొన్నారు. ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం క్రిష్టారెడ్డి కళాకారులకు రూ.10వేల సాయం అందజేశారు.



గజ్వేల్‌లో న్యూట్రీషన్ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

రెండునెలల్లో పునర్నిర్మాణ పనులు పూర్తి చేయాలి

మర్కూక్(గజ్వేల్): వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణం పనులు వెంటనే పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ రవీందర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని వర్ధరాజ్‌పూర్ గ్రామంలో వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ పునరుద్ధరణకు ప్రభుత్వం రూ.పది కోట్ల నిధులను మంజూరు చేయడంతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రెండు నెలల్లో గర్భగుడిని పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. అదేవిధంగా చిన్న చిన్న పనులను శ్రావణమాసంలోపు పూర్తి చేయాలన్నారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. సర్పంచ్ ప్రవీణ్, ఎస్ఈ వసంతనాయక్, ఈఈ బాలప్రసాద్, ఏఈలు శ్రీనివాస్, ధన్‌రాజు పాల్గొన్నారు.



ఆలయ పనులను పరిశీలిస్తున్న అధికారులు

విద్యార్థులను బడిలో చేర్పించాలి

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులను బడిలో చేర్పించాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ×మన ఊరు మన బడి×పై విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయన అవగాహన కల్పించారు. మిరుదొడ్డిలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరుదొడ్డిలోని బాలికల ఉన్నత పాఠశాలకు సకల హంగులతో కూడిన భవనం ఉన్నప్పటికీ ఒక్క విద్యార్థి కూడా లేక పోవడం విచారకరమన్నారు. అన్ని వసతులు కల్గిన ప్రభుత్వ బాలికల బడిలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థులు జాయిన్ కాకపోవడమేమిటని ప్రశ్నించారు. సర్కార్ బడుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత విద్యా బోధన, ఉచిత పాఠ్య పుస్తకాలు, మంచి రుచికరమై మధ్యాహ్న భోజనం, రెండు జతల స్కూల్ యూనిఫాంలు అందించడంతో పాటు అన్ని మౌళిక వసతులు కల్పిస్తున్నట్లు తల్లిదండ్రులకు అవగాహన కల్పించడానికి మన ఊరు మన బడి కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలన్నారు. కాగా కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, మిరుదొడ్డి మోడల్ స్కూల్‌కు బాలికలు ఎక్కువ మొగ్గు చూపడం వల్ల బాలికల పాఠశాలలో విద్యార్థులు చేరడానికి ముందుకు రావడం లేదని ఎంఈఓ జోగు ప్రభుదాసు డీఈఓకు వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గజ్జెల సాయిలు, ఎంపీటీసీ సుతారి నర్సింహులు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సూకూరి లింగం, స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ కొత్త రాజిరెడ్డి, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ అల్లిబిల్లి కుమార్, స్కూల్ హెడ్ మాస్టర్ శ్రీనివాస్, టీచర్లు శ్రీనివాస్, బాల్‌నర్సింహులు, రీడ్ టూ రూం ప్రతినిధి రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

ధర్మ ప్రచారం..ఆధ్యాత్మిక ప్రబోధం

కంచి పీఠాధిపతి విజయ యాత్ర సంపూర్ణం

వర్గల్(గజ్వేల్): కంచి పీఠాధిపతి శ్రీవిజయేంద్ర సరస్వతి విజయ యాత్ర సంపూర్ణమైంది. వర్గల్ శ్రీవిద్యాసరస్వతి క్షేత్రంలోని కంచి శంకరమఠం వేదికగా ధార్మిక కార్యక్రమాలతో శోభిల్లింది. ఆదివారం నుంచి మంగళవారం వరకు మూడు రోజుల పాటు స్వామివారు బసచేశారు. వర్గల్‌లో నూతన కంచి శంకరమఠం ప్రారంభోత్సవం, శ్రీచంద్రమౌళీశ్వరస్వామి పూజ, శ్రీవిద్యాసరస్వతిదేవికి విశేష అభిషేకం, చండీ హవనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో ఆధ్యాత్మికతలు వెల్లివిరిశాయి. రాష్ట్ర ఆర్థిక వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రముఖులు కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోనే వర్గల్ శ్రీవిద్యాసరస్వతి క్షేత్రం ధర్మనిష్ఠకు ప్రతీకగా వికసిస్తుందని, ధర్మప్రచార కేంద్రంగా విరాజిల్లుతుందని స్వామివారు పేర్కొన్నారు. శంకర మఠాల ద్వారా ధర్మప్రచారం విరివిగా జరగాలని నిర్దేశించారు. వర్గల్ ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరసిద్ధాంతి పర్యవేక్షణలో ఆలయ కమిటీ స్వామివారి పర్యటనలో లోపాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.



వర్గల్‌లో కంచి పీఠాధిపతి శ్రీవిజయేంద్ర సరస్వతి

జగద్గురువుల పర్యటన ఒక దివ్యానుభూతి



కంచి కామకోటి పీఠాధిపతులు జగద్గురు శంకరాచార్య విజయేంద్ర సరస్వతి స్వామి మూడురోజుల పాటు వర్గల్‌లో గడపడం అత్యంత ఆనందాన్ని ఇచ్చింది.


–యాయవరం చంద్రశేఖర సిద్ధాంతి, వర్గల్ క్షేత్ర వ్యవస్థాపకుడు

తెలంగాణ ప్రాంతానికే గర్వకారణం

వర్గల్ విద్యాసరస్వతీ క్షేత్రంలో కంచి మఠం ఏర్పాటు కావడం తెలంగాణ ప్రాంతానికే గర్వకారణం. మఠం ప్రారంభ సంరంభం జరిగిన మూడురోజులు దివ్యత్వాన్ని ఆవిష్కరించాయి.

–డాక్టర్ చెప్పెల హరినాథశర్మ, మర్పడగ సంతాన మల్లికార్జున క్షేత్ర వ్యవస్థాపకుడు

వర్గల్ ఖ్యాతి ద్విగుణీకృతం



ప్రకృతి రమణీయత, ప్రశాంత వాతావరణంతో దివ్య క్షేత్రంగా విరాజిల్లుతున్న వర్గల్ క్షేత్రం ఖ్యాతి శంకర మఠం ఏర్పాటుతో ద్విగుణీకృతమైంది. ఆదర్శవంతంగా ఆలయనిర్వహణ చేస్తున్న యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి ఆలయ నిర్వాహకులందరికీ రోల్ మోడల్ కావాలి.

–హరీశ్‌రావు, రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి

బాడీ ఫ్రీజర్‌తో ఉపయోగం

హుస్నాబాద్: బాడీ ఫ్రీజర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన మూడు బాడీ ఫ్రీజర్లను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతదేహాలను భద్రపరిచేందుకు బాడీ ఫ్రీజర్ ఉపయోగపడుతుందన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే మృతుల బంధువులు చివరి చూపు చూసుకోవడానికి ఈ బాడి ఫ్రీజర్లు ఉపయోగపడుతాయన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులతో పాటుగా వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ ఆస్పత్రిని తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్మన్ అయిలేని అనిత, జిల్లా గ్రంథాలయ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జెడ్పీటీసీ భూక్య మంగ, ఎంపీపీలు లకావత్ మానస, మాలోతు లక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజని, సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ రెడ్డి పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో బాడీ ఫ్రీజర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

క్లుప్తంగా

కారు దగ్ధం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నడుస్తున్న కారులో నుంచి మంటలు వచ్చి పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం ..లింగంపల్లికి చెందిన ఇండికా కారు యాజమాని తన కుటుంబ సభ్యులతో కలసి బుధవారం తెల్లావారుజామున లింగంపల్లి నుంచి పటాన్‌చెరు వైపు వెళుతున్నాడు. చౌరస్తా దాటిన తర్వాత కారులో నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో వెంటనే కారులో నుంచి అందరూ కిందకు దిగారు. చూస్తుండగానే కారు పూర్తిగా దగ్ధమైంది. ఏ ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

తాటిచెట్లు నరికిన వ్యక్తిపై కేసు

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామంలో తాటిచెట్లు నరికిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు. ఆర్లె వెంకన్న అనుమతి లేకుండా తాటిచెట్లు నరకడంతో గ్రామానికి చెందిన గౌడకులస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బైక్‌లో మంటలు.. ఆర్పిన స్థానికులు

చేగుంట(తూప్రాన్): బైక్‌లో మంటలు వస్తుండగా, గుర్తించిన స్థానికులు ఆర్పేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఓ యువకుడు బుధవారం బైక్‌పై గజ్వేల్ వైపునకు వెళుతున్నాడు. చేగుంట- గజ్వేల్ రోడ్డులోని ఆటో స్టాండ్ వద్దకు రాగానే బైక్ ఇంజన్‌లో మంటలు వచ్చాయి. దీంతో సదరు యువకుడు బైక్‌ను నిలిపి పక్కకు పరుగెత్తాడు. స్థానికులు ఇసుకతో పాటు నీళ్లు జల్లి మంటలు ఆర్పారు.

రేషన్‌బియ్యం పట్టివేత

చేగుంట(తూప్రాన్): అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్టు తహసీల్దార్ లక్ష్మణబాబు తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు చేగుంట శివారులోని ఓ చికెన్ పరిశ్రమ వద్ద అక్రమంగా తరలిస్తున్న బియ్యం ఆటోను మంగళవారం రాత్రి పట్టుకున్నామన్నారు. 34 క్వింటాళ్ల 20 కేజీల బియ్యాన్ని గోదాంకు తరలించి ఆటోను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తహసీల్దార్ తెలిపారు. పట్టుబడింది పీడీఎస్ బియ్యంగా గుర్తించి సివిల్ సప్లయ్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.

ఇద్దరి రిమాండ్

మిరుదొడ్డి(దుబ్బాక): ట్రాక్టర్ దహనం, మేక పోతును చంపిన కేసులో ఇద్దరిని అరెస్టు చేశారు. మిరుదొడ్డి ఎస్‌ఐ శ్రీధర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..ఆరు నెలల క్రితం మండల పరిధిలోని కాసులాబాద్‌కు చెందిన యాదగిరి ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కాగా ఇటీవల యాదగిరికి చెందిన మేక పోతుకు ఎవరో విష గుళికలు పెట్టారు. దీంతో మేక పోతు మృతి చెందింది. ట్రాక్టర్ దహనం, మేక మృతి చెందడంతో అనుమానం వ్యక్తం చేస్తూ కొందరిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అదే గ్రామానికి చెందిన పర్స ఆశయ్య, గోవిందారం బ్రహ్మంను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో వారు తమ తప్పును ఒప్పుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వివాహిత ఆత్మహత్య

సంగారెడ్డి టౌన్: కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. హత్నూర మండలానికి చెందిన అంజయ్య కూతురు లక్ష్మిని తాళ్లపల్లి గ్రామస్తుడు బాల్‌రాజ్ కి ఇచ్చి వివాహం చేశారు. భార్యాభర్తలు తరచూ గొడవపడుతున్నారు. ఈనెల 14వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో లక్ష్మీ ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి అంజయ్య పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముందస్తు వరిసాగే మేలు

- పంటకాలం ముందుకు జరపాలన్న ప్రతిపాదనలు
- రోహిణి కార్తె నుంచి నార్లు పోసుకోవడం పాత పద్ధతే



సాక్షి, సంగారెడ్డి డెస్క్ :

యాసంగిలో కురుస్తున్న అకాల వర్షాలు, వడగండ్ల వానల కారణంగా వరిపంటకు తీవ్రనష్టం వాటిల్లుతోంది. ముఖ్యంగా మార్చి నుంచి మే నెల వరకు కురిసే వర్షాల కారణంగా ధాన్యం దిగుబడి బాగా తగ్గుతోంది. చేతికొచ్చే కొద్దిపాటి పంటలోనూ నాణ్యత లోపిస్తోంది. యాసంగిలో వరి సాగుచేసే రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వరిసాగుకు సంబంధించి పంటకాలాన్ని ముందుకు జరపాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో అకాల వర్షాల నుంచి రైతులు బయటపడొచ్చు. దీనిపై వ్యవసాయశాఖ, వ్యవసాయ శాస్త్రవేత్తలు కసరత్తు చేస్తున్నారు.

- సాధారణంగా అయితే వానాకాలం వరిసాగుకు సంబంధించి జూలైలో నార్లు పోసి ఆగస్టు వరకూ నాట్లు వేస్తారు.
- యాసంగిలో అయితే డిసెంబర్‌లో నార్లు పోసి జనవరి, ఫిబ్రవరి నెలల్లో నాట్లు వేస్తారు. యాసంగిలో సాగు చేసిన వరిపంట మే నెలలో కోతకు వస్తుంది.
- వానాకాలం సీజన్‌లో అయితే అక్టోబర్‌లో, యాసంగి సీజన్‌లో అయితే మార్చి రెండోవారం నుంచి ఏప్రిల్ నెల వరకు అకాలవర్షాలు కురుస్తాయి. దీంతో రైతులకు నష్టం జరుగుతోంది.
- ప్రకృతి వైపరీత్యాల బారిన రైతులు పడకుండా ఉండేందుకు, వరి పంటను కాపాడుకోవడానికి ఒకటే మార్గం ఉంది. అదే పంటసాగును ఒక నెలరోజులు ముందుకు జరపడమే.
- వానకాలంసాగుకు సంబంధించి జూన్‌లో నార్లు పోసుకొని జూలై నాటికి నాట్లు పూర్తి చేయాలి.
- యాసంగిలో అయితే నవంబర్‌లో నార్లు పోసి డిసెంబర్‌లో నాట్లు పూర్తి చేయాలి.
- వానాకాలంలో 140 రోజులు అంతకన్నా ఎక్కువ సమయం గల దీర్ఘకాలిక రకాల సాగుకు మే 25 నుంచి జూన్ 5లోగా నారు పోసుకోవాలి.
- 130 నుంచి 135 రోజుల వ్యవధిగల మధ్యకాలిక రకాల సాగులో జూన్ 15 వరకు నారు పోయాలి.
- 120 నుంచి 125 రోజుల వ్యవధి గల స్వల్పకాలిక రకాల సాగుకు జూన్ 25 వరకు నారు పోసుకోవాలి.
- సాగు చేసేది ఎలాంటి రకాలైనా సరే జూలై నెల వరకు వానాకాలంలో వరినాట్లు పూర్తికావాలి.
- వానాకాలం వరికోత అక్టోబర్ 3వ వారంనుంచి నవంబర్ మొదటివారం లోపు పూర్తి చేయాలి.
- యాసంగిలో నవంబర్ 20వ తేదీలోపు నారు పోసుకోవాలి.
- పంటకాలం ముందుకు జరిపితే వానాకాలం వరికోతలు నవంబర్ మొదటి వారంలోపు పూర్తవుతాయి. అయితే యాసంగి నారు కోసం ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉంది.
- రైతులు వానాకాలం సాగు సమయంలోనే ముందు జాగ్రత్తగా యాసంగి నారు కోసం ఒక చిన్న మడిని వదిలేసుకుంటే బాగుంటుంది. దీంతో వానాకాలం పంటలు కాస్త ఆలస్యమైనా వదిలేసిన మడిలో యాసంగి కోసం సరైన సమయంలో నారు పోసుకొనే వీలుంటుంది.

ఈ యాసంగిలో వరి సాగు ఇలా (ఎకరాల్లో)

సిదిపేట	3,40,000
మెదక్	2,60,000
సంగారెడ్డి	1,00,126

యాసంగిలో కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వానల కారణంగా మెదక్ జిల్లాలో 32,884 ఎకరాల్లో, సిద్దిపేట జిల్లాలో 53 వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని అధికారులు చెబుతున్నారు. అయితే పూర్తిస్థాయిలో పంట నష్టం నమోదు ఎక్కడా జరగలేదని రైతులు, రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి.

నీటివసతి ఉంటేనే...

వానాకాలంలో వరిసాగును ముందుకు జరపాలంటే నీటివసతి తప్పనిసరి. బోరు,బావుల కింద సేద్యం చేసేచోట సాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఒకవేళ పంటసాగు కాలం ముందుకు జరిపినా ముందుగానే రైతులు బోరు,బావుల ద్వారా నార్లు పోసుకుంటారు. ప్రాజెక్టులు, కాల్వలు, లిఫ్ట్ ఇరిగేషన్, చెరువుల ద్వారా వరిసాగు చేసే చోటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైతులు నార్లు పోసుకోవాలన్నా, వాటిని పెంచాలన్నా, ఆయా సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో సాగునీటి విడుదల తేదీలను కూడా ముందుకు జరపాలి.

ఇంకా చేయాల్సినవి...

- పంటకాలం ముందుకు జరిపే క్రమంలో రైతులకు సబ్సిడీపై అందజేసే విత్తనాలు కూడా ముందుగానే రైతులు చేరేలా చూడాలి.
- నార్లు పోసే నాటి నుంచి నాట్లు వేసే వరకు అవసరమైన ఎరువులు కూడా ముందుగా అందుబాటులో ఉంచాలి.
- రైతులకు పెట్టుబడి అవసరాలు ఉంటాయి. బ్యాంకుల నుంచి అందే కొత్త రుణాలు, రుణాల రెన్యూవల్, రైతుబంధు కింద ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం కూడా రైతులకు ముందస్తుగా అందాలి.



ముందు నారు పోస్తే పంటకు బలం

హుస్నాబాద్ మండలం గాంధీనగర్‌కు చెందిన రైతు రాంగోపాల్‌రావు 15 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నాడు. గత ఏడాది వానాకాలంలో వరి సాగు చేయడంతో పాటు యాసంగి మిర్చి సాగు చేస్తే మంచి లాభాలు వచ్చాయి. ఈ వానాకాలం 15 ఎకరాల్లో వరిసాగు చేసేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ సందర్భంగా రాంగోపాల్‌రావు మాట్లాడుతూ వ్యవసాయ పంటలు ప్రారంభానికి రోహిణి, ఆరుద్ర కార్తెలే అనుకూలం. ఈ రెండు కారెల్లో విత్తనం వేస్తే పంట బలంగా వస్తుంది. ఒకేసారి 15 ఎకరాల నాటు వేయాలంటే కూలీల కొరత ఉంది. అందుకే 15 రోజుల గడువు తీసుకొని మూడు దఫాలుగా నారు పోశాను.



వరి విత్తనరకాలు, పంటకాలం, నారుపోసే సమయం



వరిసాగుకు సంబంధించి పంట కాలాన్ని ముందుకు జరిపే క్రమంలో ఏఏ రకాల విత్తనాలతో నార్లు పోసుకోవచ్చని, వాటి పంట కాలం తదితర వివరాలను సిద్దిపేట జిల్లా తోర్నాల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సీహెచ్.పల్లవి వివరించారు.

- **దీర్ఘకాలిక రకాలు:** పంటకాలం 140 రోజులపైనే. ఇందులో ప్రధానమైన వరి విత్తన రకాలు వరంగల్ 44 (సిద్ధి), కంపాసాగర్ 2874, సాంబమసూరి. మే 25 నుంచి జూన్ 5వ తేదీ వరకు నార్లు పోసుకోవాలి
- **మధ్యకాలిక రకాలు:** పంటకాలం 135 రోజులు. ఇందులో ప్రధానమైన రకాలు రాజేంద్రనగర్ 2458 (కృష్ణ), వరంగల్ 32100 (వరంగల్ సన్నాలు), వరంగల్ 915, జగిత్యాల 384, పొలాస ప్రభ, జగిత్యాల 28545, జగిత్యాల 27356, వరంగల్ 1487 జూన్ 15వ తేదీ వరకు నార్లు పోసుకోవాలి
- **స్వల్పకాలిక రకాలు :** పటకాలం 120 నుంచి 125 రోజులు. ఇందులో ప్రధానమైనవి సన్న రకాలైన కునారం-1638, వరంగల్ 962, రాజేంద్రనగర్-21278, రాజేంద్రనగర్-15048 (తెలంగాణ సోనా), దొడ్డురకాల్లో కునారం-118 (కూనారం సన్నాలు), జగిత్యాల - 24423, జగిత్యాల - 18047 (బతుకమ్మ), రాజేంద్రనగర్-29325, మారుటేరు-1010 (కాటన్ దొర సన్నాలు).
- వానాకాలం వరిపంటకు జూన్ 25 లోపు నారు పోసుకుంటే...అక్టోబర్ మూడో వారం నుంచి నవంబరు మొదటి వారంలోపు కోతలు పూర్తి చేసుకోవచ్చు. ఈ విధానం ద్వారా మళ్లీ యాసంగిలో వరి ఆరుతడి పంటలను సకాలంలో సాగు చేసుకోవడానికి వీలవుతుంది. ఇక యాసంగిలో వరి సాగుకు స్వల్పకాలిక రకాలను ఎంచుకొని నవంబర్ 15 నుంచి 20వతేదీలోపు విత్తుకుంటే మార్చి నెలాఖరు నుంచి ఏప్రిల్ మొదట్లో పంట కోతకు వస్తుంది. తద్వారా వర్షాల నష్టం నుంచి మనం పంటను కాపాడుకోవచ్చు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థిని అంత్యక్రియలు పూర్తి

వట్‌పల్లి(అందోల్): బాసర ట్రిపుల్ ఐటీలో ఆత్మహత్యకు పాల్పడిన వడ్ల దీపిక అంత్యక్రియలు పూర్తయ్యాయి. స్వగ్రామం వట్‌పల్లి మండలం గొర్రెకల్ గ్రామంలో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థుల అశ్రునయనాలతో వీడ్కోలు పలికారు. మంగళవారం దీపక మరణించిన విషయం తెలిసినప్పటి నుంచి విద్యార్థిని కడసారీ చూపుకోసం గ్రామస్తులు ఎదురుచూస్తూ బుధవారం నిరీక్షించారు. నిర్మల్ ఆస్పత్రి నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు విద్యార్థి మృతదేహం చేరుకోవడంతో గ్రామస్తులు ఆమె ఇంటికి చేరుకున్నారు. విగతజీవిగా ఉన్న యువతిని చూసి బంధువులు, గ్రామస్తులు కన్నీరు మున్నీరుగా విలపించారు. దీంతో గ్రామం శోకసంద్రంలా మారిపోయింది. విద్యార్థి తండ్రి వీరన్న తన కూతురు మృతదేహాన్ని చూస్తూ బిడ్డ నీవు లేకుండా ఎట్లా బతకాలి అంటూ రోదించడం అక్కడున్న వారందరిని కంటతడి పెట్టించింది.



రోదిస్తున్న దీపిక తండ్రి, కుటుంబ సభ్యులు

బైక్ అదుపు తప్పి...

దుబ్బాకరూరల్: బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం..రాజన్నసిరిసిల్లా జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన ఎండీ ఇర్ఫాన్(30) దుబ్బాకలోని తన బంధువులను కలిసేందుకు వస్తున్న క్రమంలో చీకోడ్ గ్రామంలోని పెట్రోల్ పంపు వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తల్లి ఏదుల్‌బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం పైనుంచి పడి మహిళ ..

రాయపోలు(దుబ్బాక): ద్విచక్రవాహనంపై నుంచి కింద పడి ఓ మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ చైతన్య కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామానికి చెందిన రామకృష్ణ తన భార్య నాగరాణి (25), కూతురు గిరిష్కను తన ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని చేగుంట మండలం కర్నాల పల్లికి మంగళవారం సాయంత్రం బయలు దేరారు. ఈ క్రమంలో దౌల్తాబాద్ మండలం సూరంపల్లి శివారులో ద్విచక్రవాహనం వెనుకాల కూర్చున్న నాగరాణి కింద పడి తీవ్ర గాయాలతో అక్కడే మృతి చెందింది. గమనించిన రామకృష్ణ బైక్ ఆపి చూసేసరికి తలకు తీవ్ర గాయాలై మృతిచెందినట్టు గుర్తించాడు.

వ్యక్తి అరెస్ట్

నర్సాపూర్: మహిళను వేధించిన కేసులో ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. నర్సాపూర్ ఎస్‌ఐ శివకుమార్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం .. పట్టణంలోని ఓ హాస్పిటల్ సమీపంలో కృష్ణమోహన్ ఓ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించడం అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచారు.అనంతరం జైలుకు తరలించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

రాయపోలు(దుబ్బాక): చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. రాయపోలు ఎస్‌ఐ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లా దోర్నాల మండలం రామచంద్రకోట గ్రామానికి చెందిన దర్శనం జాను(32) గతేడాదిగా రాయపోలు మండలం రాంసాగర్‌కు వచ్చి భార్య పుష్పతో నివాసం ఉంటున్నాడు. తాపీమేస్త్రీగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి భార్యతో గొడవపడి జాను అదే రాత్రి దూలానికి చీరతో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సలహామేరకు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



జాను మృతదేహం

వృద్ధురాలి గొంతుకోసి చంపిన నిందితురాలి అరెస్ట్

కేసును ఛేదించిన పోలీసులకు సీపీ అభినందనలు

సిద్దిపేటరూరల్: వృద్ధురాలి గొంతుకోసి చంపి బంగారు వస్తువులు దొంగిలించిన ఘటనలో నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సిద్దిపేటరూరల్ సీఐ జానకిరామ్ రెడ్డి తెలిపారు. చిన్నకోడూరు ఎస్‌ఐ శివానందంతో కలిసి ఆ వివరాలు వెల్లడించారు. నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాలగొంది గ్రామానికి చెందిన బాలగొని లింగవ్వ(75) ఇంటి దగ్గర ఒంటరిగా ఉంటుంది. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు లింగవ్వ గొంతు కోసి చంపి బంగారు ఆభరణాలు అపహరించారు. ఈ ఘటనపై వృద్ధురాలి మేన కోడలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 7న చిన్నకోడూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. సీఐ 3 బృందాలతో నిందితుల ఆచూకీ కోసం వెతికారు. కేసును అన్ని కోణాల్లో పరిశోధన చేసి టెక్నికల్ ఆధారాలతో కోహెడ మండలం శనిగారం గ్రామానికి చెందిన దయ్యాల సుజాతను నిందితురాలిగా గుర్తించారు. నిందితురాలిని విచారణ చేయగా తానే 7వ తేదీన చేపలు అమ్ముకుంటూ వెళ్లి లింగవ్వ ఇంట్లోకి చొరబడి హత్యచేసి మెడలోని బంగారం దొంగిలించినట్టు ఒప్పుకుంది. దీంతో నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించామని సీఐ తెలిపారు. సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి, సీఐ జానకిరామిరెడ్డి, చిన్నకోడూరు ఎస్‌ఐ శివానందం, కానిస్టేబుళ్లు కమలాకర్ రెడ్డి, పరుశరాములు, శ్రీకాంత్‌లను కమిషనర్ శ్వేత అభినందించి రివార్డు అందజేశారు.



రివార్డు అందజేస్తున్న సీపీ శ్వేత

బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ హత్యకేసులో నేరస్తుడికి యావజ్జీవ శిక్ష

వివరాలు వెల్లడించిన గజ్వేల్ ఏసీపీ రమేశ్

గజ్వేల్‌రూరల్: బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న మహిళ హత్యకేసులో నేరస్తుడికి యావజ్జీవ శిక్ష పడినట్లు గజ్వేల్ ఏసీపీ రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాల్లోకి వెళితే..రాజన్న-సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటకు చెందిన న్యాలకంటి లక్ష్మీరాజ్యం-మణెమ్మ దంపతుల మూడోకూతురు దివ్య(24) గజ్వేల్‌లోని ఏపీజీవీబీ(ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు)లో ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ పట్టణంలోని లక్ష్మీప్రసన్ననగర్‌లో అద్దె ఇంట్లో నివాసముండేది. వరంగల్‌కు చెందిన బ్యాంక్ ఉద్యోగి సందీప్‌తో 2020 ఫిబ్రవరి 26న దివ్యకు వివాహం నిశ్చయమైంది. గతంలో దివ్య కుటుంబం వ్యాపార రీత్యా వేములవాడలో నివాసముండేవారు. దివ్య హైస్కూల్‌లో చదువుకునే సమయంలో వేములవాడలోని శాస్త్రీనగర్‌కు చెందిన కైరి వెంకటేష్ ప్రేమపేరుతో పెళ్లి చేసుకుంటానని వేదింపులకు గురిచేయడంతో అదే సమయంలో పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. అయినప్పటికీ తీరుమారని కైరి వెంకటేష్ 2020 ఫిబ్రవరి 18న రాత్రి 8:20గంటల సమయంలో గజ్వేల్‌లోని కిరాయి ఇంట్లో నివాసముంటున్న దివ్య వద్దకు వచ్చి గొడవపడ్డాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దివ్యపై కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. దివ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ సంగమేశ్వర్ కేసు నమోదు చేశారు. సీఐ ఆంజనేయులు కేసు పరిశోధన ప్రారంభించి నిందితుడు వెంకటేష్‌ను అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపించారు. ఈ ఘటన జరిగిన సమయంలో ఇన్‌చార్జి సీపీగా ఉన్న సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత ప్రమాదస్థలానికి చేరుకొని నేరం జరిగిన తీరును పరిశీలించారు. సిద్దిపేట జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టులో కేసు విచారణ సందర్భంగా జడ్జి టి. రఘురాం ఇరువురి వాదనలు విని నిందితుడు వెంకటేష్‌పై నేరం రుజువైనందున యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించినట్లు గజ్వేల్ ఏసీపీ రమేష్ తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటలింగం తన వాదనలు వినిపించగా, కోర్టు కానిస్టేబుళ్లు దేవేందర్, రాజిరెడ్డి, కోర్టు లైజనింగ్ ఏఎస్‌ఐ స్వామిదాస్, హెడ్‌కానిస్టేబుల్ రాజమల్లులు సహకరించారు. సీఐ వీరప్రసాద్, ఇన్వెస్టిగేషన్ చేసిన పోలీసు అధికారులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు పోలీసు సిబ్బందిని సీపీ శ్వేత అభినందించారు.

కారు బైక్ ఢీ.. వ్యక్తికి గాయాలు

కొల్చారం(నర్సాపూర్): కారు బైక్ ఢీ కొట్టిన ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తికి గాయలైన సంఘటన మండల కేంద్రంలోని మెదక్-నర్సాపూర్ జాతీయ రహదారి చౌరస్తాపై బుధవారం చోటు చేసుకుంది. ప్రమాదానికి సంబంధించి ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు.. చిన్నఘనపూర్ గ్రామానికి చెందిన చాకలి యాదగిరి తన బైక్‌పై పని నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడని తెలిపారు. ఇదే సమయంలో హైదరాబాద్ వైపు నుంచి అతివేగంగా వస్తున్న కారు, యాదగిరి బైక్ వెనక నుంచి ఢీ కొట్టిందన్నారు. దీంతో ఒక్కసారిగా బైక్‌తో పాటు యాదగిరి కొద్ది దూరంలో రహదారిపై ఎగిరిపడ్డట్లు తెలిపారు. ప్రమాదంలో యాదగిరి తలకు, ఇతర భాగాల్లో గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ తరలించినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

శివ్వంపేట(నర్సాపూర్): సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ జరుగుతుందని రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం రాత్రి తూప్రాన్ డీఎస్పీ యదగిరిరెడ్డితో కలిసి మండల పరిధిలోని బిజ్లీపూర్‌లో సీసీ కెమెరాలను ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, దాతల సహాయంతో అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీధర్, ఎస్‌ఐ రవికాంత్‌రావు, మండల కోఆప్షన్ మెంబర్ లాయక్, సర్పంచ్ చిట్యాల లక్ష్మి, ఉప సర్పంచ్ జహంగీర్ తదితరులు ఉన్నారు.

కారు-టిప్పర్ ఢీ

- నలుగురికి తీవ్ర గాయాలు, ఒకరి పరిస్థితి విషయం
- గాయపడ్డవారిని ఆస్పత్రికి తరలించిన సునీతారెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): మట్టి టిప్పర్ కారును ఢీకొనడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన నర్సాపూర్- హైదరాబాద్ ప్రధాన రహదారిపై బుధవారం జరిగింది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం...నర్సాపూర్‌కు చెందిన హరిభూషణమ్మ, ప్రకాశ్, నాగరాణి, అన్నపూర్ణ హైదరాబాద్ నుంచి నర్సాపూర్‌కు కారులో వెళుతున్నారు. ఇదే క్రమంలో నర్సాపూర్ నుంచి టిప్పర్ నల్లవల్లి సమీపంలోని ప్రధాన రహదారిపై వేగంగా వస్తూ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి నర్సాపూర్ వెళుతున్నారు. ప్రమాదం జరగడం చూసి వెంటనే తన కాన్వాయ్ వాహనాల్లో గాయపడ్డ వారిని హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులతో మాట్లాడి గాయపడ్డ వారిని మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ప్రస్తుతం హరిభూషణమ్మ పరిస్థితి విషమంగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు. మట్టి టిప్పర్ వాహనాలతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నియంత్రించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ విజయకృష్ణ తెలిపారు.



గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తున్న సునీతారెడ్డి